# చీకటి బ్రతుకు

రచన:
శ్రీ డి. రామచంద్రము

రుక్మిణికి ఏపనంటు రానిదిలేదు. ప్రస్తుతము మాత్రము మిషన్ కుడుతూవుంది. రుక్మిణికి ఒక చెల్లాయి వుంది. ఆమె వయస్సు పదమూడేళ్ళు. మిషన్‌దగ్గర కూర్చుని సూదితో చొక్కాకు కాజాలు కుట్టుతున్నది. పద్మ చేత్తో యేదో గుడ్డ పట్టుకవచ్చి 'వదినా నువ్వు చూపించిన పువ్వు సరిగా కుట్టడం కుదరడములేదు.' అంటూ చేతిలో వున్న గుడ్డ రుక్మిణికి చూపించింది.

రుక్మిణి మిషన్ పైనుండి లేచి, ఆ పువ్వుము కుట్టవలసిన విధానము మరియొకసారి చెప్పి, గుడ్డమీద రంగిన్ పెన్సిలుతో గుర్తులుపెట్టి యిచ్చింది.

'వదినా నువ్వు కుడితే బాగావుంటుంది. మాకు సరిగా కుదరదేం వదినా' అంది గుడ్డ తీసుకుంటూ పద్మ.

'ఇదో లెక్కా నేర్చుకుంటే మీ అందరికీ వస్తుంది' అంది రుక్మిణి.

'నాలుగైదు రోజుల నుండి అష్టకష్టాలు పడుతున్నా కుదురడంలేదు.'

'కాస్త మనస్సు ఓపికపట్టి నేర్చుకోవాలి మరి? ఇలా తొందరపడితే యెట్లా?' పద్మ మిషన్ సమీపంలో కట్టుపైన కూర్చుని, గుడ్డమీద రుక్మిణి పెట్టిన గుర్తుల ప్రకారము తప్పిపోకుండా కుడుతూ, 'ఏం వదినా మిషన్ కుట్టు నేర్చుకుంటే, ఎన్నిరోజులలో వస్తుంది' అని పురమాయించింది.

'పద్మ నీ కెందుకమ్మా ఈపాడు మిషన్ పని. నీకు ఏలాంటి ధనవంతుడు, ఉద్యోగస్తుడు భర్తగా రానున్నాడో!' అంది రుక్మిణి.

'భర్త వచ్చినంత మాత్రాన నేర్చుకుంటే తప్పా వదినా! గుడ్డలను కట్ చేయడం, గౌనులు, నిక్కర్లు మొదలగునవి కుట్టాలని నాకెంతో ఇష్టం' అంది పద్మ.

'నాకేం అభ్యంతరములేదు పద్మా! అయితే నేర్చుకో, ముందుముందు నీ మొగుడికి షర్ట్సు, నీకు పుట్టబోయే పిల్లలకు గౌనులు, నిక్కర్లు అన్నీ నీవే కుట్టుకోవచ్చు' అంది రుక్మిణి.

'అలాఅయితే పని నేర్చుకుంటే యెన్నిరోజుల్లో వస్తుంది వదినా!' అని అడిగింది పద్మ.

'అదో లెక్కా! పని నేర్చుకునేవాళ్ళ ఇంటరెస్టును బట్టి వుంటుంది. గౌనులు, నిక్కర్లు ఒకరీతిగా కట్టడం వరకు నాలుగైదు మాసాల్లో వస్తుంది' అంది రుక్మిణి.

రుక్మిణి ఆ వీధిలో కాపురంపెట్టి ఆరేడుమాసాలైంది. ఆమెది ఏవూరో, ఆమె గృహపరిస్థితులు ఏమిటో అక్కడివాళ్ళకు తెలియవు. రుక్మిణి వయస్సు ఇంచుమించుగా పాతికేళ్ళుంటవి. చెల్లె, తనూ తప్ప ఆ యింట్లో ఎవరూలేరు. రుక్మిణి ఆ వీధిలో చిన్న గది కిరాయకు తీసుకుని కుట్టుపని కుట్టడం మొదలుపెట్టింది. నిక్కర్లు, గౌనులు అవీ కుట్టడమేకాక, పోత (అల్లకం) పనిలోనూ తెల్లని చీరలపై మరియు జాకెట్లపై గులాబీలు, లతలు మొదలగునవి కలర్సు ధారాలతో అందముగా కుట్టుతుంది. ఆ వీధిలోవున్న అమ్మాయిలు ఆమెదగ్గరకు కుట్టుపని, పోతపోయడం నేర్చుకుంటున్నారు. ఆ అమ్మాయియిళ్ళలో పద్మ ఒకటి, పద్మంటే రుక్మిణికి ఎనలేని ప్రేమ.

ముఖ్యముగా రుక్మిణి గురించి యిరుగు పొరుగు ఆవిడలు చెడుగురించి ఊహాగానాలు చేస్తున్నారు. ఆ ఊహాగానాలు బయటికీ కూడా అమ్మలక్కల నోట్లోనుండి బయలుదేరినవి. రుక్మిణి వ్యభిచారము చేస్తుంది, ఏదో అందరితో మన్ననలు పొందాలనే ఊహతో మిషన్ కుట్టు మొదలెట్టిందని కొందరు, రుక్మిణిని చేసుకున్న మొగుడు విడిచిపెడితే, మనవూరు వచ్చి మిషన్ కుట్టుకుంటుందని కొందరు, కాదుకాదు రుక్మిణమ్మ చేసుకున్న మొగుణ్ణి వదిలేసి యెవడినో తీసుకుని లేచివచ్చిందనీ, వాడు రాత్రిళ్లు వచ్చిపోతూవుంటాడని మరికొందరూ, ఇట్లా ఎన్నెన్నో పుకార్లు అమ్మలక్కల నోటిలోనుంచి బయలుదేరాయి. ఆ వీధిలో సుబ్బమ్మ అనే ఆవిడ యున్నది. యిటువంటి ముచ్చట్లు అంటే 'ఆలిండియా రేడియో' వార్తలకన్నా ముందుగానే ప్రతి యిల్లాలుకు చెప్పుకపోతూ ప్రచారం చేస్తుంది. యిది ఆమె ముఖ్యమైన పని. ఆవిడకు ఏ పనంటూలేదు. రుక్మిణి ఆ వూరికి మొదట్లో వచ్చినప్పుడు రుక్మిణివద్ద బట్టలు కుట్టించింది. చివరికి బట్టలకువచ్చి ఆవిడ చేసిన జగడము ఇంతాఅంతాకాదు. కుట్టు కూలి ఇవ్వకుండానే తీసుకపోయింది. ఆనాటినుండి రుక్మిణి అంటే సుబ్బమ్మకు కోపం, సుబ్బమ్మంటే రుక్మిణికి మహాకోపం యిలా రోజులు గడుస్తున్నాయి.

రోజులు గడుస్తున్నాయి. రుక్మిణి తనదగ్గర కుట్టుపని నేర్చుకునే అమ్మాయిలంతా ఒకతీరు. మరియు పద్మ అమ్మాయి ఒకతీరు. వాళ్ళిద్దరికి చాలా స్నేహబంధము కుదిరింది. పద్మమాత్రము వాళ్ళ స్వంత యింట్లో ఎప్పుడు యింత అన్నం తింటుందో అంతే. ఎప్పుడూ రుక్మిణిదగ్గరే కూర్చుంటుంది. ఆదినమున 'పద్మ రుక్మిణి దగ్గర కూర్చుని

గుడ్డపై యథావిధిగా గులాబీ పువ్వులు కుడుతూ, అవి సరిగా రాకపోవడంవల్ల సతమతమవుతున్నది.

అప్పటికి మధ్యాహ్నం ఒంటిగంట కావస్తుంది. రుక్మిణి చేస్తున్న పని ఆపి వంటింట్లోకి వెళ్లి, 'పద్మా' అని పిలిచింది.

పద్మ 'ఏమిటొదినా?' అంటూ తను చేస్తున్న పనిఆపి, గుడ్డ టేబిల్ పై పెట్టి లోనికి వెళ్ళింది.

'తిందామురా పద్మా. ఆ పీటమీద కూర్చో. యివాళ ఒక విచిత్రం జరిగింది. శోభ వాళ్ళ అమ్మ తనకు రవికలు కుట్టించుకుని డబ్బులు యివ్వకుండా చక్కని పాలు పోసింది. అందువల్ల ఈరోజు పాయసంవండాను. ఇద్దరం భోంచేద్దాంరా' అంది రుక్మిణి. పద్మ తొట్రుపడుతూ, 'యెందుకులే వొదినా' అంది.

అట్లాకాదు. నాదగ్గర ఈపూటకి భోంచెయ్యక తప్పదు అంటూ రుక్మిణి రెండుకంచాలలో పాయసం వడ్డించింది. విధిలేనందువలన పద్మ ఆపూట అక్కడే భోజనంచేసింది.

వారంరోజుల తర్వాత రుక్మిణికి ఒక పురిటిబట్టలగిరాకీ వచ్చింది. బట్టలను తొందరగా యివ్వాలనే ఉద్దేశ్యంతో రాత్రిపూట లాంతరు దగ్గరపెట్టుకుని, మిషన్ కుడుతూ యున్నది. అప్పుడే పద్మ తలిదండ్రులు రాగా రుక్మిణి కుడుతూవున్న మిషన్ ఆపి, 'పద్మ కోసం వచ్చారా? పద్మ యింతకుముందే యింటికి వచ్చిందే' అంది.

'పద్మకోసం కాదు అమ్మాయ్! నీతో ఒక విషయం మాట్లాడుదామని వచ్చాం' అన్నాడు పద్మ తండ్రి భుజంగరావు.

'నిజమా అత్తా! ఏమిటా విషయము' అయితే చెప్పు దానికేం అభ్యంతరము అంది రుక్మిణి.

'ఏమండీ మీరు చెబుతారా? లేక నన్ను చెప్పమంటారా' అంది పద్మ తల్లి విశాలాక్షమ్మ.

'నీవే చెప్పవే నన్ను విసిగించక' అన్నాడు భుజంగరావు.

వెంటనే రుక్మిణితో విశాలాక్షమ్మ చెప్పడం మొదలెట్టింది.

'చూడు అమ్మాయ్. పద్మకు ఎన్నిరోజులనుంచో మంచి సమ్మంధాలకోసం గాలిస్తూ వుంటే, యెక్కడా దొరకటంలేదు. ఇప్పుడు ఇబ్రహీంనగర్ నుంచి ఓచక్కని సమ్మంధం వచ్చింది. కుఱ్ఱవాడు ఉద్యోగం చేస్తున్నాడట. మూడువందలు జీతం, కొంత వ్యవసాయంకూడ ఉన్నదట. కాని అది ఎంతకు అంతేనట. పిల్లాడు లేత వాడేనట. ఈ మధ్యనే ఆవిడ విడాకులు ఇచ్చిపోయిందట. ఎందుకో ఏమో మాకు ఇంకా తెలుపలేదు. పిల్లాడు మంచి తెలివివంతుడట. వాళ్ళ భార్యాభర్తలు చెప్పరానంత ప్రేమతో ఉండేవారట. ఆవిడ విడాకులు యివ్వడంతో ఆయనగారు మానసికంగా బాధపడుతూవుంటే, స్నేహితులు, బంధువులు ఓదార్చి కొంత తెచ్చారట. అంతేకాదు అమ్మాయ్ ఆరేడు రోజులు అన్నం, నీళ్లుకూడా ముట్టుకోలేదట.

ఈ ముఖ్యమైన సంగతులు తెలిసాయి. ఈ పిల్లాడు పోతే మళ్ళా మంచి పిల్లాడు దొరకడు, అంతే కాదు మళ్లీ ఈ లాంటి సమ్మంధం దొరకదు. రెండో పెళ్ళయితే మాత్రమేం? నిక్షేపంలాంటి సమ్మంధము. ఇంటికి చాకిరీ చేసేటందుకు ఒక పని మనిషట సమ్మంధం ఎంత మంచిది అనుకున్నావు అమ్మాయ్, యివన్ని నీకు ఎందుకు చెప్తున్నానంటే మా పద్మగాని రెండో పెళ్ళని సందేహిస్తుందేమో. నువ్వు కొంత యిష్టగించి చెపుతావని నీతో చెప్పవచ్చామమ్మయ్' అంది.

'అయ్యో! రామా! అంతకంటే ఇంకేం కావాలి అత్తా! మంచి సమ్మంధమయితే, మంచి పిల్లాడయితే ఎందుకు విడచి పెట్టడం. పద్మతో నేను చెపుతాలె - అత్తా' అంది రుక్మిణి.

'సరే లే అమ్మా' అంటు ఆయనగారు శ్రీ భుజంగరావు లేచాడు.

'సరే మావయ్యా, దీని గురించి మీరు ఏమి ఆలోచించకండి' అంది రుక్మిణి.

మర్నాడు వాడుక ప్రకారం పద్మవచ్చింది. రాగానే రుక్మిణి కుట్టవలసిన విధము చెప్పి మిషన్ కుట్టడం ప్రారంభించింది. పద్మ కాసేపు కుట్టుకుని 'వొదినా! ఈ రోజు కుట్టడం కుదురుతుంది' అంది.

'అలాగే కుట్టు' అంది రుక్మిణి.

కొంతసేపు ఆగి రుక్మిణి 'నీ కేదో మంచి సమ్మంధం వచ్చిందటగా పద్మా?' అని అడిగింది.

'అవునట వొదినా' అంది పద్మ.

'నువ్వింకా పిల్లాణ్ని చూడలేదా?' అని అడిగింది రుక్మిణి.

'చూడలేదొదినా' అంది పద్మ.

'అతగాడికి తిరిగి మళ్లీ పెళ్ళట అనగా, రెండో పెళ్ళని విన్నాను. పిల్లాడు చూడు పద్మ, లేతవాడేనట. ముఖ్యంగా మనం చూడవలసింది పిలాడి వయస్సు, తెలివితేటలు, ఆరోగ్యము, అందము రెండో పెళ్ళయితేనేం ముచ్చటపోతుంది. మంచివాడు అయితేసరి తొలుతగా పెళ్లి చేసుకున్న వాళ్ళుమాత్రం యేం ఇరుగపెడుతున్నారు. చేసుకున్న వాళ్ళన్ని నానా బాధలు పెట్టడం లేదు?

నేను మొదటి పెళ్ళి వాణ్ణి చేసుకొని ఏం బాగుపడ్డాను? నాజీవితం తీరని అష్టకష్టాలకు గురైంది' అని చెప్పింది రుక్మిణి.

ఈ మాటలతో పాపం వెనకటి జ్ఞాపకాలు రుక్మిణి కళ్ళల్లో మెదలుచొచ్చినవి. తనకు పెళ్ళి ఈడురాగానే తన తల్లి వాళ్ళ అన్నయ్య సహాయంతో తనకు పెళ్ళి సమ్మంధాలు వెదకడం మొదలు పెట్టింది. అసలు వాళ్ళది రంగధాంపల్లి అను గ్రామము, వాళ్ళ అమ్మనాన్నలకు ఇద్దరు సంతానము ఇద్దరు ఆడపిల్లలే, తాను మొదటిది, రెండోది చెల్లాయి. తండ్రి ఓ చిన్న కంపెనీలో పనిచేసి యేమి మిగల్చకుండా వెళ్ళిపోయాడు తనకు మాతము ఎన్నెన్నో సమ్మంధాలు చూస్తున్నారు. చిటచివరకు ఎల్లుపల్లి అను గ్రామములో వచ్చిన సమ్మంధం ఒకటి కుదరగా తనకు వివాహం చేసారు. మొగుడు చదువుకున్నవాడు, ఉద్యోగముకూడ వుంది. ఇంతో అంతో ఆస్తికూడ ఉన్నది. ఈ మానవ జీవితంలో పెళ్ళికంటె ఆనందాన్నిచ్చేదేముంది? తన ఆనందానికి మేరలేదు. తానో ఇంటి దానిని అయిపోతున్నది, భర్తతో ప్రేమ సుఖ జీవితం గడపవచ్చును. ఇక ఆ యింటికి యజమానురాలే తానే. తనకు కలగబోయే పిల్లలు, వాళ్లు పెద్దవాళ్ళయితే తిరిగి వాళ్ళకు పెళ్ళిళ్ళు. కోడళ్ళతో, అల్లుళ్ళతో, మనుమనమరాండ్రతో తన ఇల్లంతా కలకలలాడుతుంది. నిజానికి స్త్రీకి ఈ కోర్కెలు సహజము. ఇంకా ఏవేవో గాలిమేడలు నిర్మించుకుని సంతోషపడేది. మొత్తంమీద ఏమైతేనేం పెళ్ళి కాగానే తనను కాపరానికి పంపారు ఎన్నో ఆశలతో, కోర్కెలతో అత్తవారింట్లో ఇంటి కోడలుగా అడుగు పెట్టింది. తన మొగుడు ప్రతి చిన్న పని దగ్గరా, ప్రతి చిన్న విషయముదగ్గరా తిట్టేవాడు, కాళ్ళకి వేసుకునే చెప్పులదగ్గర నుంచి అందివ్వవలసి వచ్చేది. ఆయనగారు ఆఫీసునుంచి వచ్చేసరికి గడగడ వణుకుతూ యెదురువెళ్ళి అన్నీ అందివ్వాలి. ఏదైనా కాస్త ఆలస్యమైనా మండిపడేవాడు. ఆయనగారివద్ద ఒక నవ్వు లేదు గివ్వులేదు. అంతేకాదు మరి ఒక సరసమూ లేదు. ముఖం మాత్రం యెప్పుడూ అగ్నికణాలవలె వుండేది. భార్యభర్తల అనురాగం, ప్రేమ అంటులేవు. తనను ఒక పని మనిషిలా చూచెవాడు.

'కథాంజలి'లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు ఏమాత్రమూ మేము బాధ్యులు కాదు. —సంపాధకుడు.

# గమనిక.

మా కరీంనగర్ ఏజెంటు శ్రీ ఎం. గోపాలంగారు 'కథాంజలి' అంకెల పోటీలు జరిపించగా జనవరి 1974 నెల సంచికలో గెలుపొందిన నెం. 38. వారి పేరు: —

(1) శ్రీ అర్జున్,
నెం. 1-6-13 ప్రకాష్‌గంజ్,
కరీంనగర్ (ఎ. పి.)

(2) 'కథాంజలి' ఫిబ్రవరి 1974 నెల సంచికలో సదరి అంకెల పోటీలో గెలుపొందిన నెం. 4 వారి పేరు:—

కె. లక్ష్మిరెడ్డి,
కొక్కెరకుంట,
వన్నారం పోస్టు
కరీంనగర్ జిల్లా

పై గెలుపొందిన వారికి 'కథాంజలి' 4 నెలల సంచికలను ఉచితముగా పంపబడును.

సం॥ 'కథాంజలి'

తను పుట్టింటి గ్రామంలో ఒక పెద్ద ఉద్యోగస్థుడుండేవాడు. ఆయన అంత ఉద్యోగి అయినా ఆఫీసు నుంచి యింటికి రాగానే భార్యభర్తలు యెదురెదురుగా కూర్చుని నవ్వుతూ ప్రేమతో ఎంతో సంతోషముగా నుండేవాళ్లు. ఆ దంపతులు ఒకరినొకరు ప్రేమించుకునే వారు. వారు ఎంతో ప్రేమానురాగంతో వుండేవాళ్ళు. భార్యకు ఏదైనా జరిగిందంటే అయనగారు గడగడలాడే వారు, మరి ఆవిడకూడ అంతే. నిజంగా దాంపత్య జీవితమంటే తాను అంత సుఖప్రదమంగా వుంటుందనుకున్నది. తాను తొలుత వెళ్ళిన రోజుల్లో తన భర్త మాత్రము రాత్రుళ్ళు యింటివద్ద పడుకునేవాడు కానీ, రానురాను రాత్రుళ్లు యింటివద్ద పడుకోవడం బొత్తిగా మానివేశాడు. తాను ఒకనాడు తన అత్తమ్మతో జంకుతూ మీ అబ్బాయిగారు రాత్రుళ్లు యింటిపట్ల పడుకోడంలేదని చెప్పింది.

అందుకు ఆవిడ 'వాడు ఆఫీసుపనులమీద మేనేజరుతో కలసి ఎక్కడికో వెళ్ళుతూ ఉంటాడు. ఆ పనులన్నీ చూడక నీకు యెదురుగా కూర్చోవాలంటావా?' అంది.

—(సశేషము)